సాక్షి హనుమకొండ

బుధవారం | 9 | ఆగస్టు | 2023



బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యం

హనుమకొండలోని నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో బీఎస్పీ ఆధ్వర్యంలో బహుజన విద్యార్థి భరోసా సభ జరిగింది. - 8లో▸



'ఎస్‌ఎఫ్‌సీ' విద్యార్థుల ఆందోళన

హాస్టల్ వసతి కల్పించాలంటూ కాకతీయ యూనివర్సిటీలోని సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉండి సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

టీటీసీ అభ్యర్థులకు 27న పరీక్ష

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో మే, జూన్‌లో 42 రోజుల టీటీసీ సమ్మర్ ట్రైనింగ్ కోర్సు పూర్తిచేసినవారికి, టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (లోయర్ గ్రేడ్) థియరీ పరీక్షలో ఫెయిలైన అభ్యర్థులకు ఈనెల 12న పరీక్ష నిర్వహించాల్సి ఉంది. కానీ, ఆపరీక్షను ఈనెల 27న నిర్వహించనున్నట్లు డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై మంగళవారం తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎడ్యుకేషనల్ సైకాలజీ అండ్ స్కూల్ అడ్మినిస్ట్రేషన్, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు మెథడ్స్ ఆఫ్ టీచింగ్ (జనరల్) పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3-30 నుంచి సాయంత్రం 4-30 గంటల వరకు మెథడ్స్ ఆఫ్ టీచింగ్ (స్పెషల్) పేపర్ పరీక్షను కూడా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఐదో రోజు 19 దరఖాస్తులు

- బోణీకొట్టిన కాజీపేట ఎక్సైజ్ స్టేషన్

కాజీపేట అర్బన్: మద్యం షాపుల కోసం హనుమకొండ కలెక్టరేట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మంగళవారం ఐదో రోజు దరఖాస్తుల సంఖ్య 19కి చేరింది. దరఖాస్తులను హనుమకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ స్వీకరించారు. కాగా, వరంగల్ అర్బన్ జిల్లా ఎక్సైజ్ పరిధిలోని వరంగల్ అర్బన్‌కు 6, ఖిలావరంగల్‌కు 5, హనుమకొండకు 4, కాజీపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వైన్స్‌కు 4 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం కాజీపేట ఎక్సైజ్ స్టేషన్ బోణీ కొట్టగా..4దరఖాస్తులను స్వీకరించారు.

తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాల విక్రయం



హన్మకొండ అర్బన్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన తిరంగా క్యాంపెయిన్‌ను పురస్కరించుకుని హనుమకొండ పోస్టల్ డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాలను విక్రయించనున్నట్లు సూపరింటెండెంట్ వి.హనుమంతు తెలిపారు. కలెక్టరేట్‌లో జాతీయ జెండాలను కలెక్టర్ సిక్తాపట్నాయక్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్‌కు సూపరింటెండెంట్ జాతీయ జెండాను అందజేశారు. 20 నుంచి 30 అంగుళాల జెండా ధర రూ.25 ఉందని ఆయన తెలిపారు.

కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



ఎంజీఎం: వైద్య, ఆరోగ్య శాఖలో 20 సంవత్సరాల నుంచి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదానాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా యాదానాయక్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించపోతే 15వ తేదీన జెండావిష్కరణ తర్వాత విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభావతి, సుజాత, చంద్రకళ, సరోజ, నర్మద, విజయలక్ష్మి, విజయ, రజిత పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలి



కేయూ క్యాంపస్: హెచ్‌ఐవీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కాకతీయ యునివర్సిటీ వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. 12న అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం 5కే మారథాన్‌ను నిర్వహించారు. హనుమకొండ, వరంగల్ జిల్లా విద్యార్థులతో ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన మారథాన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అదనపు డీఎంహెచ్‌ఓ టి.మదన్‌మోహన్, కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ పి.భాస్కర్, ఫిజికల్ డైరెక్టర్ ఏటీబీటి ప్రసాద్, ఏవీవీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి కోడిమల శ్రీనివాస్‌రావు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వప్న మాధురి, సూపర్‌వైజర్ రామకృష్ణ, జిల్లా మాస్‌మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, డీహెచ్‌ఈఓ సందెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభ్యసనాభివృద్ధికి 'ఉన్నతి'

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హైస్కూళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో అమలు

- 9, 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో హెచ్‌ఎంలకు శిక్షణ
- 17, 18, 19 తేదీల్లో సబ్జెక్టు టీచర్ల రిసోర్స్ పర్సన్లకు..



విద్యారణ్యపురి: విద్యార్థుల్లో సామర్థ్యాలు, అభ్యసనా ఫలితాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుంచి ఉన్నతి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 6 నుంచి 9 తరగతుల విద్యార్థుల కోసం దీనిని రూపొందించారు. ఈ కార్యక్రమ ఆవశ్యకత, లక్ష్యాలు, విధివిధానాలు, వాచకాలు, బోధనా ప్రణాళికలు తదితర అంశాలపై పూర్తి అవగాహన కోసం ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు బుధవారం నుంచి శిక్షణ ఇవ్వనున్నారు.

జిల్లాలో 136 పాఠశాలలు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఉన్నతి కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. హనుమకొండ జిల్లాలో 124 హైస్కూళ్లు, 9 కేజీబీవీలు, మూడు మోడల్ స్కూళ్లలో ప్రవేశపెట్టనున్నారు.

తొలి విడత హెచ్‌ఎంలకు శిక్షణ

మొదట ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఒక్కో జిల్లాలో ప్రధానోపాధ్యాయుల నుంచి నలుగురు, సబ్జెక్టు టీచర్ల నుంచి 28 మంది చొప్పున రిసోర్స్ పర్సన్లను గుర్తించారు. హెచ్‌ఎంలకు ఈనెల 9, 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లోని టీఎస్ ఐపార్డులో శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే, సబ్జెక్టు టీచర్ల రిసోర్స్‌పర్సన్లకు ఈనెల 17, 18, 19న హైదరాబాద్‌లోనే శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందిన వారు తమ తమ జిల్లాలకు వచ్చి మిగతా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

ఉన్నతి కార్యక్రమ లక్ష్యం..

భాషలో మౌలిక సామర్థ్యాలను చదవడం, రాయడంతోపాటు సామర్థ్యాల వారీగా అభ్యసన ఫలితాలను సాధించడమే ఉన్నతి ఉద్దేశం. నాన్ లాంగ్వేజెస్‌లో పాఠానికి అవసరమైన పూర్వ భావనలు, పలు అంశాలపై అవగాహన కలిగించే ఆయా సబ్జెక్టులకు సంబంధించిన అభ్యసన ఫలితాలను పెంపొందించడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

అభ్యసన సామర్థ్యాల కోసం..

కరోనా అనంతర పరిస్థితుల్లో విద్యార్థులు సామర్థ్యాలను సాధించడంలో వెనుకబడి ఉన్నట్లు వివిధ సర్వేలు చెబుతున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగిస్తే విద్యార్థులు పైతరగతులకు వెళ్తారు. కానీ, అభ్యసన సామర్థ్యాలు, అకడమిక్ పరంగా స్టాండర్డ్స్ పొందలేరు. వీటిని అధిగమించడానికి ఉన్నతి కార్యక్రమం దోహదపడుతుంది.

బోధనా ప్రణాళికలతో..

స్థాయికి అనుగుణంగా బోధనా ప్రణాళికలను రూపొందించుకొని వార్షిక ప్రణాళిక, పాఠ్యప్రణాళిక, పీరియడ్ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటారు. 45 నిమిషాల బోధనా పీరియడ్‌ను సోపానాల ప్రకారం అర్థవంతంగా పఠనోత్సవాన్ని నిర్వహిస్తారు. పిల్లల స్థాయికి అనుగుణంగా బోధనా ప్రక్రియలు, వ్యూహాలను రచించుకుంటారు. భాషా సబ్జెక్టులతోపాటు నాన్ లాంగ్వేజెస్ బోధనలో కూడా కొంత సమయాన్ని ప్రతి పీరియడ్‌లో పిల్లలతో చదివించడానికి కేటాయిస్తారు. సబ్జెక్టుల వారీగా నిర్దేశించిన సామర్థ్యాలను పరీక్షించి పిల్ల ల ప్రగతిని ఒక రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ప్రధానోపాధ్యాయులు నెలవారీగా నిర్వహించే పాఠశాల స్థాయి సమీక్ష సమావేశానికి హాజరై పిల్లల ప్రగతిని చర్చిస్తారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, సమీక్ష సమావేశాల్లో ఉపాధ్యాయుల పనితీరును అంచనా వేసి వారికి మార్గదర్శనం చేస్తారు.

ప్రారంభంలోనే బేస్‌లైన్ టెస్ట్..

ఉన్నతి కార్యక్రమం 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల కోసం నిర్దేశించింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రారంభంలోనే బేస్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. అందుకోసం ప్రశ్నపత్రం రూపొందించి పిల్లల స్థాయిని గుర్తించి నమోదు చేస్తారు.

ఉన్నతి విజయవంతానికి కృషి



పాఠశాల విద్యాశాఖ సూచనల మేరకు కలెక్టర్ మార్గనిర్దేశంలో జిల్లాలో ఉన్నతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి హనుమకొండ పాఠశాల విద్యాశాఖ కృషి చేస్తోంది. ఇందు కోసం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ ద్వారా పూర్తి అవగాహన కల్పించి, కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తాం

– మహ్మద్ అబ్దుల్‌హై, డీఈఓ

మంచి ఫలితాలు సాధిస్తాం..



విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు సాధించే విధంగా కృషి చేస్తాం. తొలి మెట్టు కార్యక్రమం లాగే ఉన్నత పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులకు మార్గదర్శనం చేస్తాం. విద్యార్థుల పరిస్థితిని అంచనా వేస్తూ, నిరంతర పర్యవేక్షించి, ఈ కార్యక్రమం మంచి ఫలితాలు సాధించే విధంగా పనిచేస్తాం. ముఖ్యంగా పిల్లలకు తెలుగు, హిందీ, ఆంగ్లంలో చదవడం, రాయడంపై అవగాహన కల్పిస్తాం.

– ఎ. శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్

పరకాలలో బీజేపీ గెలుపు ఖాయం

- సీఎం కేసీఆర్ జిమ్మిక్కులను ప్రజలు నమ్మేస్థితిలో లేరు
- పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

దామెర: పరకాల నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి స్పష్టం చేశారు. దామెరలో మంగళవారం పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారుమాట్లాడారు. పరకాలకు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేసింది శూన్యమని అన్నారు. ఆయన దృష్టంతా తన ఆస్తులను కాపాడుకోవడం మీదే ఉందని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో కేసీఆర్‌కు హామీలు గుర్తుకొస్తున్నాయని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ, ఉద్యోగులకు పీఆర్సీ, గృహలక్ష్మి అంటూ కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సంతోష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ముల్క ప్రసాద్, కోకన్వీనర్ మాదారపు రతన్‌కుమార్, మండల ఇన్‌చార్జ్ నానునాయక్, కార్పొరేటర్ రవినాయక్, గంకిడి బుచ్చిరెడ్డి, సూర చందర్, పెంచాల జగన్, దండు పద్మ, వేల్పుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కెమిస్ట్రీతో ముడిపడి ఉన్న జీవితాలు

- రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ కన్వీనర్ డాక్టర్ పీసపాటి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డాక్టర్ పీసపాటి వెంకటేశ్వర్లు

కమలాపూర్: రసాయన శాస్త్రంతోనే మన జీవితాలు ముడిపడి ఉన్నాయని రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ కన్వీనర్ డాక్టర్ పీసపాటి వెంకటేశ్వర్లు అన్నారు. రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ డెక్కన్ సెక్షన్ హైదరాబాద్, కమలాపూర్ ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్, ఈటల నిషాంత్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కమలాపూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మంగళవారం కెమిస్ట్రీ ప్రాక్టికల్ డిమాన్‌స్ట్రేషన్, క్విజ్ పోటీల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై రసాయన శాస్త్రానికి సంబంధించిన వివిధ అంశాల ప్రదర్శన, సేంద్రియ సమ్మేళనాలు, పరమాణు నమూనాలు, సంతృప్త, అసంతృప్త రకాల హైడ్రోకార్బన్ల గురించి వివరించారు. ఆర్‌ఎఫ్ ట్రూకీ విద్యార్థులకు వివిధ ప్రయోగాలను చేసి చూపించారు. ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ వి.జయతీర్థరావు 100 మంది విద్యార్థులకుపైగా క్విజ్ పోటీలు నిర్వహించారు. సమ్మయ్య, రిటైర్డ్ జడ్జి నిమ్మల నారాయణ, రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ టి.సాంబమూర్తి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.అనిత, వివిధ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

మాడవీధులు, రాజగోపుర నిర్మాణాలపై సమీక్ష

హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయాన్ని యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ప్రముఖ సినీ ఆర్ట్ డైరెక్టర్, ఆర్కిటెక్ట్ ఆనంద్‌సాయి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శేషుభారతి, ప్రధానార్చకుడు భద్రకాళి శేషు, వేదపండితులు వారిని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాడవీధులు, రాజగోపురం నిర్మాణాలపై సమీక్షించారు. అధికారులు డీపీఆర్ గురించి వివరించారు. ప్రభుత్వానికి నివేదిక అందించడానికి వారు ఆలయాన్ని సందర్శించారు. మంత్రి కేటీఆర్ ఆదేశాలతో త్వరగా పనులు ప్రారంభిస్తామని ఆనంద్‌సాయి తెలిపారు. వారి వెంట కుడా పీఓ అజిత్‌రెడ్డి, అధికారి భీంరావు, టూరిజం అధికారి శివాజీ ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్‌ఎస్ నాయకులు

కాజీపేట: అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సీఎం కేసీఆర్ ప్రజల ఆకాంక్ష మేరకు పనిచేస్తున్నారని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట పట్టణంలో మంగళవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం సోమిడి ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మూడోసారి గెలిచి, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని అన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చా రు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త హరిప్రసాద్ కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. అంబేద్కర్‌నగర్‌లో ప్రభుత్వ కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం తహసీల్దార్ భావుసింగ్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ్, ఆర్టీఏ కమిటీ సభ్యుడు కాటాపురం రాజు, రైతు బంధు సమితి సభ్యుడు సుంచు కృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు పి.శివకుమార్, బి.రంజిత్‌కుమార్, మిట్టపల్లి రవీదర్, సుంచు అశోక్, తేలు సారంగపాణి, రావు ల సదానందం పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళి..

కాజీపేట చౌరస్తాలో మంగళవారం గద్దర్ చిత్రపటానికి వినయ్‌భాస్కర్ నివాళులర్పించారు. ఆయన వెంట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

రిలీవయ్యాడు.. రిపోర్ట్ చేయడు!

- పోస్టింగ్ కోసం రెవెన్యూ శాఖలో ఓ అధికారి ప్రయత్నాలు
- తనకు కావాల్సిన మండలంలోనే ఇవ్వాలని పట్టు
- రాజకీయ నేతలు, ఉన్నతాధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాలో ఇటీవల పెద్దఎత్తున తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. ఈక్రమంలో పక్క జిల్లాలో పనిచేస్తున్న ఓ తహసీల్దార్ బదిలీపై జిల్లాకు వచ్చాడు. రిలీవ్ అయిన ఆయన ఇంకా పోస్టింగ్ పొందిన జిల్లాలో రిపోర్ట్ చేయలేదు. కానీ, తనకు ఎక్కడ పోస్టు కావాలో ఎంపిక చేసుకుని ఉన్నతాధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకొస్తున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఒకవిధంగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు బదిలీలు జరిగినా పోస్టింగ్‌లు మాత్రం దాదాపు రాజకీయ నాయకుల ప్రమేయంతోనే ఇచ్చారనేది బహిరంగ రహస్యం. అధికార గణం కూడా సాధ్యమైనంత వరకు వారు చెప్పిన వారికి చెప్పిన చోట పోస్టింగ్ ఇచ్చింది. ఖాళీ అయిన స్థానాల్లోకి కొత్తగా వచ్చిన వారు వెళ్లారు. అయితే, దీంతో ఎవరికీ పెద్దగా ఇబ్బందిలేదు. కానీ, ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. తహసీల్దార్ పోస్టింగ్‌ల తర్వాత ఒక్క శాయంపేట మండలం మాత్రమే ఖాళీగా ఉంది. ఈ మండలానికి ఇటీవల పక్క జిల్లా నుంచి మరో అధికారి బదిలీపై వచ్చాడు. ఆ పోస్టును ఉన్నతాధికారులు సదరు అధికారికి దాదాపు ఖరారు చేశారు. అధికారిక ఉత్తర్వులు మాత్రం ఇంకా వెల్లడించలేదు. తహసీల్దార్ స్థాయికి సంబంధించి హనుమకొండ ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓ పోస్టు, పరకాల ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓ పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. రిపోర్ట్ చేయాల్సిన సదరు అధికారికి వీటిలో ఏదో ఒకటి కేటాయించే అవకాశం ఉంది. దీంతో రిపోర్ట్ చేయకుండా ముందు పోస్టు ఖరారు చేసుకునే పనిలో ఉన్నారు.

14 మండలాల్లో తనకు కావాలనుకున్న మండలాలు చెప్పి అక్కడ కొత్తగా పోస్టింగ్ పొందినవారిని తీసి మరీ తనకు అక్కడ పోస్టింగ్ ఇవ్వమని ఒత్తిడి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కేవలం రాజకీయ నాయకులతోనే కాకుండా ఇతర ప్రభుత్వ శాఖలు, నిఘా వర్గాల వారితో కూడా పోస్టింగ్ కోసం ఆయన ప్రయత్నిస్తుండడం రెవెన్యూ వర్గాలో చర్చనీయాంశంగా మారింది. ఈస్థాయి ఒత్తిళ్లతో అధికారులు ఎవరికి పోస్టింగ్ ఇచ్చి, ఈ అధికారికి పోస్టింగ్ ఇస్తారో చూడాలి.

కలెక్టరేట్‌లో 'గృహలక్ష్మి' దరఖాస్తుల స్వీకరణ



కలెక్టరేట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లో గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేశారు. మంగళవారం వివిధ మండలాల నుంచి 2700 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. గురువారం సాయంత్రం వరకు అర్హులు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

మనువళ్లను చూసేందుకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి
- ధర్మారం శివారులో ఘటన




పసుల మొగిలి-సావిత్రి (ఫైల్)

నడికూడ: మనువళ్లను చూసేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో దంపతులు మృత్యు ఒడికి చేరారు. ఈ ఘటన ధర్మారం గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ప్రకారం.. పరకాలలోని మాదారం కాలనీకి చెందిన మేస్త్రీ పసుల మొగిలి (55), సావిత్రి (50) దంపతులు వరంగల్‌లోని కూతురు, మనవళ్లను చూసేందుకు వారి ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో ధర్మారం గ్రామ శివారులోని తాటి వనం వద్ద హనుమకొండకు చెందిన వైద్యుడి కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో మొగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సావిత్రి పంట పొలాల్లో ఎగిరిపడి తీవ్రంగా గాయపడగా స్థానికులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, సావిత్రి తాను రానని భర్త మొగిలిని ఒక్కడినే వెళ్లమని చెప్పింది.. మనువళ్లను చూడక చాలా రోజులైంది, ఇద్దరం వెళ్దామని మొగిలి చెప్పి తీసుకెళ్లినట్లు బంధువులు రోదిస్తూ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇద్దరి మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం పరకాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో బంధువుల రోదనలు మిన్నంటాయి.

శరవేగంగా రైల్వే మూడోలైన్ పనులు

- మక్కోడి–సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య 24 కిలోమీటర్ల నిర్మాణం
- త్వరలో హసన్‌పర్తి–ఉప్పల్, చింతలపల్లి–వరంగల్ మధ్య ప్రారంభం




కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని మక్కోడి–సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య రైల్వే మూడోలైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బల్లార్షా–కాజీపేట రైల్వే స్టేషన్ మధ్య చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా మక్కోడి–సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య 24 కిలోమీటర్ల మూడో లైన్ పనులు త్వరలో పూర్తి చేసి, రైళ్లు నడిపించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనున్నట్లు మంగళవారం అధికారులు తెలిపారు. త్వరలో హసన్‌పర్తి–ఉప్పల్ రైల్వే స్టేషన్ల మధ్య 12 కిలోమీటర్ల వరకు, చింతలపల్లి–వరంగల్ మధ్య 10 కిలోమీటర్ల పనులు చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు.

దర్గా రైల్వే గేట్ 5 రోజులు మూసివేత

రైలు పట్టాల మరమ్మతు కారణంగా ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు దర్గా రైల్వే గేట్‌ను మూసివేస్తున్నట్లు మంగళవారం రైల్వే అధికారులు తెలిపారు. దర్గా వద్ద గల కిలోమీటరు నంబర్ 369/14–16 సమీపంలోని రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్‌ను ఐదు రోజుల పాటు మూసివేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. దర్గా రైల్వే గేట్ నుంచి అప్ అండ్ డౌన్ మార్గంలో ప్రయాణించే వారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణం



రాజిరెడ్డి, సమ్మయ్య మృతదేహాలు

ఎల్కతుర్తి: ఎల్కతుర్తి మండలంలోని వేర్వేరు గ్రామాల్లో మంగళవారం ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. ఇంట్లో ఎదిగిన కూతురు ఉంది.. రోజూ తాగి వస్తున్నావని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన సమ్మయ్య ఉరివేసుకుని చనిపోయాడు. అదే విధంగా భార్య చనిపోవడంతో ఒంటరి జీవితం గడపలేక రాజిరెడ్డి అనే మరోవ్యక్తి పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

తాగొస్తున్నావని మందలించినందుకు..

మద్యానికి బానిసై రోజూ తాగి ఇంటికి వస్తుండగా ఎదుగుతున్న బిడ్డను ఎవరైనా పెళ్లి చేసుకుంటారా అని మందలించినందుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని దామెర గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకోగా, మంగళవారం వెలుగు చూసింది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గండికోట సమ్మయ్య(40)కు భార్య కోమల, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరు కూలిపని చేసుకుంటూ జీవిస్తున్నారు. సమ్మయ్య కొంతకాలంగా మద్యానికి బానిసై రోజూ తాగి ఇంటి వస్తున్నాడు. 'రోజూ తాగి ఇంటికి వస్తే ఎట్ల. ఇంట్లో ఎదిగిన బిడ్డ ఉంది. ఎవరైనా పెళ్లి చేసుకుంటారా' అని భార్య కోమల మందలించింది. దీంతో సమ్మయ్య మనస్తాపానికి గురై సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు తలుపులు పగులగొట్టి చూడగా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. చికిత్స నిమిత్తం 108వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

ఒంటరి జీవితం భరించలేక..

ఎల్కతుర్తి మండలంలోని జీల్గుల గ్రామానికి చెందిన పెద్ది రాజిరెడ్డి (66) భార్య ఇటీవల చనిపోయింది. దీంతో ఒంటరి జీవితం భరించలేక మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజిరెడ్డి భార్య శశిరేఖతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులకు పెళ్లిళ్లు జరిగి జీవితంలో స్థిరపడ్డారు. రాజిరెడ్డి తన భార్య శశిరేఖతో కలిసి జీవించేవాడు. రెండు నెలల క్రితం భార్య అనారోగ్యంతో చనిపోయింది. రాజిరెడ్డి ఇంట్లో ఒంటరిగా జీవించేవాడు. ఒంటరి జీవితం భరించలేక మానసిక క్షోభతో మంగళవారం ఇంట్లో క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన ఇరుగుపొరుగు వారు 108కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే చనిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఎంసీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 9వతేదీ నుంచి ఎంసీఏ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు (సీబీసీఎస్ రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్ మెంటు) నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 9, 11, 14, 16, 18 తేదీల్లో పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని తెలిపారు.

ఆస్తిలో వాటా కోసం .. నిరసన

- మాజీ ఎంపీ కల్పనాదేవి వారసుడి ఆందోళన



తల్లిదండ్రుల ఫొటోలతో నిరసన చేస్తున్న మాజీ ఎంపీ కల్పనాదేవి చిన్న కుమారుడు డాక్టర్ జయసింహారెడ్డి

హన్మకొండ చౌరస్తా: తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తిలో తనకు రావాల్సిన వాటా ఇవ్వకుండా తన సోదరుడు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మాజీ ఎంపీ, దివంగత కల్పనాదేవి చిన్న కుమారుడు డాక్టర్ జయసింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ఆస్తిలో తన వాటా ఇవ్వకుంటే ఆత్మహత్యే శరణ్యమంటూ హనుమకొండ పద్మాక్షికాలనీలోని జయ నర్సింగ్ కళాశాల ఎదుట మంగళవారం అమ్మ, నాన్న ఫొటోలను వెంటబెట్టుకుని కుటుంబ సభ్యులతో కలిసి ఉరితాళ్లతో నిరసన తెలిపాడు. విషయం తెలుసుకున్న పలువురు స్థానికులు జయసింహారెడ్డి ఆందోళనకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా జయసింహారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆస్తిలో భాగమైన 60 ఎకరాలను తనకు తెలియకుండా సోదరుడు నర్సింగరెడ్డి రియల్ ఎస్టేట్‌కు అప్పగించాడని, వారసత్వ ఆస్తుల లెక్కలు తేల్చకుండా పత్రాలను దాచిపెట్టి తనకు వాటా దక్కకుండా ఒక్కడే అనుభవిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా నర్సింగరెడ్డి తన ఆస్తుల, ఆదాయ లెక్కలను తేల్చి తనకు రావాల్సిన వాటా ఇవ్వకుంటే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు.

అడవే అమ్మ ఒడి..

విభిన్న సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనం ఏజెన్సీ గూడేలు

- ప్రకృతితోనే జీవన గమనం
- పూర్వీకుల నుంచి ఆచరణ
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఏటూరునాగారం : చుట్టూ దట్టమైన అడవి.. మధ్యలో కొండలు..గుట్టలు, ఆ మధ్యలో ఆవసాలు.. వాటి చుట్టు ఉండే వాగులు.. వంకలు..సెలయేరులు.. అటవీ జంతువులతో సహవాసం.. ప్రకృతితో మమేకం. ఇవి ఆదివాసీల జీవన విధానానికి ప్రతీక. బహ్య ప్రపంచానికి ఏ మాత్రం సంబంధం లేని జీవన విధానం వారి సొంతం. మైదాన ప్రాంత భాష, అలవాట్లు, ఆచారం, ఆహార్యానికి పూర్తి విరుద్ధం. ప్రపంచం కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకుపోతున్నా ఇప్పటికీ తమ ఆచారం, సంప్రదాయం, సంస్కృతులను అలాగే కొనసాగిస్తున్నారు. అడవిలో లభించే దుంపలు..ఇతర కాయలు ఆహారంగా తీసుకుంటూ ఆరోగ్యంగా జీవిస్తున్నారు. నీరు, అటవీ ప్రాంతాలనే ఆసరా చేసుకుని నాడు పూర్వీకులు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. నాటి ఆవాసాలే నేటి ఆదివాసీ గూడేలు. ఈ నేపథ్యంలో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం

ఆదివాసీ హక్కుల పరిరక్షణకు సమావేశం

ఆదివాసీల సంరక్షణ, హక్కులు, సంస్కృతి పరిరక్షణ, తదితర అంశాలను ఐక్యరాజ్యసమితి ఏకగ్రీవంగా ఆమోదించింది. 1982 ఆగస్టు 9న జెనీవాలో 26 మంది స్వతంత్ర మానవ హక్కుల సంఘం నిపుణులతో సమావేశం నిర్వహించింది. ఇందులో భాగంగా ఆదివాసీల సంరక్షణ, హక్కులు, సంస్కృతి పరిరక్షణ, తదితర అంశాలను పరిరక్షించడం తోపాటు ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవంగా జరపాలని తీర్మానించింది. అప్పటి నుంచి ఆదివాసీ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం ప్రపంచంలో 70 దేశాల్లో 5వేల తెగలకు చెందిన 40 కోట్ల జనాభా ఉందని సమాచారం. ఆదివాసీలు 6700 భాషలు మాట్లాడుతున్నారు. దేశంలో 461 రకాల ఆదివాసీ తెగలు ఉండగా 92 శాతం వరకు అటవీ ప్రాంతంలో వ్యవసాయం, వేట, అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. షెడ్యూల్ ప్రాంతంలో అడవులు, కొండలతో నిండి ఉంటుంది. గూడేలు, పెంటల్లో ఆదివాసీ మానవ సమాజం తొలిబిడ్డలు గోండు, కోయ, కోలాం, ప్రధాన్, నాయక్‌పోడ్, బగత, జాతపు, కొండారెడ్డి, చెంచు, ఖోందు, అంధ్, ముఖదొర, ఆరోగ్యం మున్నెంవార్ వంటి జాతులున్నాయి.



కొమ్ము నృత్యం చేస్తున్న దింసా కళాకారులు (ఫైల్)

విద్య, వైద్యం కోసం నేటికీ పోరాటాలే..

అంతర్జాతీయంగా ఆదివాసీల సమస్యలు విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, భూమి, సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులు, పర్యావరణం వంటి అంశాల పరిరక్షణకు సమితి సర్వప్రతినిధి సభ 1993లోనే తీర్మానం చేసింది. కాగా, జిగురు, బంక, ఇప్పపువ్వు, తునికాకు, చింతపండు, తేనె, చీపుర్లు, విస్తారాకులు, కలప, తదితర అటవీ ఉత్పత్తులపై ఇప్పటికీ ఆదివాసీలు ఆధారపడి జీవిస్తున్నారంటే అతిశయోక్తికాదు. విద్య, వైద్యం కోసం ఇప్పటికీ ఏదో చోటా పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి.

ఆదివాసీల చట్టాలు

5వ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు రక్షణగా 1/70, పెసా చట్టం, అటవీ హక్కుల గుర్తింపు చట్టం ఉన్నా వనరులు దోపిడీ అవుతున్నాయని ఆదివాసీలు పోరాటం చేస్తూనే ఉన్నారు. చట్టం వచ్చిన క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో 42 లక్షల ఎకరాలకు హక్కు పత్రాలు ఇవ్వాలని గుర్తించారు. కానీ 3.31 లక్షల మందికి మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చారు. ఇటీవల జిల్లాలో 6546 మందికి మందికి పోడు పట్టాలు ఇచ్చారు.



చింతలమోరి గొత్తికోయగూడెం

గూడేల్లో సౌకర్యాలు కరువు

స్వాతంత్య్రం వచ్చి 76 సంవత్సరాలు అవుతున్నా నేటికీ మౌలిక వసతులు లేక ఆదివాసీలు అభివృద్ధికి ఆమడ దూరంలో మగ్గుతున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన గొత్తికోయలకు ప్రభుత్వాలు ఇప్పటి వరకూ కనీస వసతులు కల్పించలేకపోయాయి. రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉంటున్నారనే ఒకే కారణం వారికి శాపంగా మారింది. రోడ్లు ఉండవు.. తాగు నీరు లేదు. విద్యుత్ సరఫరా, పక్కా ఇళ్లు, పాఠశాలు, పౌష్టికాహారం కూడా లేని దీనస్థితిలో గొత్తికోయలు కాలం వెళ్లదీస్తున్నారు.

నృత్యాలు

ఆదివాసీలోని పలు రకాల తెగల్లో ఒక్కొక్కరు ఒక్క రకమైన నృత్యం చేస్తారు. ఇందులో కొమ్ము నృత్యం, దింసా, డోలు నృత్యాలు ఉంటాయి. ఈ నృత్యాలు పెళ్లిళ్లు, జాతర, పండుగల సమయంలో ఎక్కువగా చేస్తారు.



కంతనపల్లి అడవిలో నృత్యం చేస్తున్న గిరిజనులు (ఫైల్)

ఆదివాసీల హక్కులను కాపాడాలి



ఆదివాసీల హక్కులను కాపాడాలి. ఎన్ని ప్రభుత్వాలు, ఎందరు పాలకులు మారినా ఆదివాసీల రాతలు మాత్రం మారడం లేదు. ప్రభుత్వ పథకాలు కింది స్థాయికి చేరితేనే అభివృద్ధి సాధ్యం. దీనిపై ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ఆదివాసీల హక్కులు, చట్టాలను కాపాడాలి.

– కొప్పుల సరిత, ఆదివాసీ మహిళ, ఏటూరునాగారం

సంస్కృతిని పరిరక్షించాలి



ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అర్హులకు అందేలా చూడాలి. పండుగలు, ఆచారాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి. వాటికి ప్రత్యేక ప్యాకేజీ కల్పించి ఘనంగా జరపాలి.

– కబ్బాక శ్రావణ్, ఏటూరునాగారం

ఆచారాలు, సంప్రదాయాలు

కోయ మహిళలు నేల మీదే ప్రసవిస్తారు. మంత్రసానులు ఉంటారు. పుట్టిన వెంటనే పిల్లలకు కలి చల్లుతారు. మూడో రోజు ముడి దొండాకు పసరు పోస్తారు. బాలింతలకు ఉప్పు చెక్క, పెద్ద చెట్ల మందు పోస్తారు. పురుడు చేయడం ఆచారం. 11, 13, 15 రోజుల్లో పేర్లు పెట్టడం, 21వ రోజు తొట్టెలో వేసి బారసాల చేయడం వారి ఆచారం. పిల్లల పేర్లు ఇలవెల్పు సమ్మక్క పేరుమీదే ఎక్కువగా ఉంటాయి.

పండుగలు.. దేవతలు

కోయల పండుగలు విభిన్నం.. విశిష్టం. వీరు ప్రధానంగా ఆరు రకాల పండుగలు చేసుకుంటారు. భూమి పండుగ లేదా విత్తు పండగ, సూరాల పండుగ, సుంకుల పండుగ చేసుకుంటారు. పొట్ట పండుగ లేదా వెన్నుగంటి పండుగ, కొత్తల పండుగ, పెద్దల పండుగ, సమ్మక్క పండుగ, మండ మెలిగె, రెండేళ్లకోసారి చేసే సమ్మక్క పండుగలను జరుపుకుంటారు.

బావమరిది మృతదేహం తీసుకొస్తుండగా ప్రమాదం.. బావ మృతి

మరిపెడ/బయ్యారం: అనారోగ్యంతో చనిపోయిన బావమరిది మృతదేహన్ని ప్రైవేటు అంబులెన్స్‌లో తీసుకువస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో బావ మృతిచెందాడు. ఈ దుర్ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం ఇస్లాపురం గ్రామానికి చెందిన ముద్ద సారయ్య(40) బావమరిది అదే గ్రామానికి చెందిన గజ్జి సంపత్(43) హైదరాబాద్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతన్ని మృతదేహన్ని బావ సారయ్య ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో మరిపెడ మీదుగా స్వగ్రామానికి తరలిస్తుండగా జాతీయ రహదారిపై కాలువవెంట నిర్మించిన రోడ్డు వాల్‌ను ఢీ కొట్టింది. దీంతో అంబులెన్స్‌లో ముందు కూర్చున్న సారయ్య క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. అందులో ప్రయాణిస్తున్న గజ్జి అప్పయ్య, డ్రైవర్ శివకుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని క్షతగాత్రులను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తుతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లున్నారు.



సారయ్య(ఫైల్)



సంపత్ (ఫైల్)

రైలుకు వెళ్లినా బతికేవాడు..

సారయ్య భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బావమరిది సంపత్ అనారోగ్యానికి గురికావడంతో చూసేందుకు హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి సారపాక వెళ్లేందుకు రైలు టికెట్ సైతం రిజర్వేషన్ చేయించుకున్నప్పటికీ బావమరిది చనిపోవడంతో అంబులెన్స్‌లో రావాల్సి వచ్చింది. రైలుకు వెళ్లినా ప్రాణంతో ఉండేవాడని బంధువులు విలపించారు.



పక్కపక్కనే పేర్చిన బావ, బావమరుదుల చితిల వద్ద విషాదంలో బంధువులు

ఇంటి సామగ్రి కడుగుతుండగా..

- పాము కాటు.. చికిత్స పొందుతూ వివాహిత మృతి
- పలివేల్పులలో ఘటన



పద్మ (ఫైల్)

హసన్‌పర్తి : ఇంటి సామగ్రి కడుగుతుండగా పాము కాటు వేసింది. దీంతో ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం నగరంలోని పలువేల్పులలో జరిగింది. పలివేల్పులకు చెందిన సల్లా పద్మ(38) ఉదయం ఇంటి ఆవరణలో సామగ్రి (బోళ్లు) కడుగుతుండగా పాము కాటు వేసింది. వెంటనే ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

అప్పల బాధ భరించలేక రైతు ఆత్మహత్య..

అప్పుల బాధ భరించలేక ఓ రైతు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన బైరి సాంబరెడ్డి(58), అవసరాల నిమిత్తం వివిధ వర్గాల నుంచి అప్పు చేశారు. తీర్చే మార్గం కనిపించక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. కాగా, మృతుల కుటుంబాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు నరేడ్ల శ్రీధర్, చల్లావెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, పీఏసీఎస్‌చైర్మన్ గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన (పోక్సో) కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు, రూ.20వేల జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. పరకాల పట్టణానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలికను పెళ్లి చేసుకుంటానని.. లేదంటే మీ అమ్మానాన్నను చంపుతానని వరంగల్ రంగంపేటకు చెందిన వివాహితుడు మహ్మద్ సమీర్ అలియాస్ సాజిత్ 2019 ఏప్రిల్ 24న రాత్రి బెదిరించి వెంట తీసుకెళ్లాడు. 15 రోజులు వివిధ ప్రాంతాల్లో తిప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ కేసులో నేరం రుజువుకావడంతో సాజిత్‌కు జైలుశిక్షతోపాటు రూ.20వేలు జరిమానా విధిస్తూ జడ్జి టి.జయలక్ష్మి తీర్పు వెల్లడించారు. ఈ కేసును పోలీసులు అధికారులు మధు, రవికిరణ్, వెంకటరత్నం పరిశోధించగా.. వైజన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో హెచ్‌సీ సుధాకర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ బి. రాజమల్లారెడ్డి కేసును వాదించారు.

'అకుట్' సర్వసభ్య సమావేశం రసాభాస

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) సర్వసభ్య సమావేశంలో కమిటీ రద్దుకే మొగ్గుచూపారు. అందుకు సంఘం జనరల్ సెక్రటరీ ససేమిరా అన్నారని సమాచారం. సర్వసభ్యసమావేశంలో వాగ్వివాదాలు చోటుచేసుకొని రసాభాసగా మారి అర్ధంతరంగా ముగిసింది. టీచర్ల సమస్యలపై స్పందిస్తే తప్పా అని ఇస్తారి ప్రశ్నించారని సమాచారం. కేయూలోని కామర్స్‌కళాశాల సెమినార్ హాల్‌లో మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అకుట్ సర్వ సభ్య సమావేశం జరిగింది. 86 మంది సభ్యులకుగాను సమావేశానికి 30మంది మాత్రమే హాజరయ్యారని సమాచారం. అధ్యక్షుడు టి.శ్రీనివాస్ హాజరుకాకపోవడం గమనార్హం. ఉపాధ్యక్షురాలు ఆచార్య బ్రహ్మేశ్వరి అధ్యక్షత వహించారు. పలు అంశాలపై చర్చించారు. చివరికి జనరల్ సెక్రటరీ ఇస్తారి, ఉపాధ్యక్షురాలు బ్రహ్మేశ్వరి జాయింట్ సెక్రటరీ కిషోర్ ప్రమేయం లేకుండానే మిగిలినవారు అంతా అకుట్ కమిటీని రద్దు చేస్తున్నట్లుగా తీర్మానం చేసుకొని సంతకాలు చేసుకున్నారని సమాచారం.

బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యం



సభలో ఐక్యతా అభివాదం చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఎస్పీ నాయకులు

- కేసీఆర్ ప్రగతి భవన్, ఫాంహౌస్‌కు తిరిగేందుకు రూ.79 కోట్ల ఖర్చు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- పబ్లిక్‌గార్డెన్‌లో 'బహుజన విద్యార్థి భరోసా' సభ



ర్యాలీగా వస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హన్మకొండ చౌరస్తా: బహుజనుల ప్రభుత్వం.. విద్యార్థి రాజ్యంగా ఉంటుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. విద్యార్థులను పట్టించుకోని కేసీఆర్ దుకాణం బంద్ చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సీఎం కేసీఆర్ ఫాంహౌస్, ప్రగతి భవన్ మధ్య తిరగడానికి ఏడాదికి రూ.79 కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో మంగళవారం 'బహుజన విద్యార్థి భరోసా' సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. అంతకుముందు అదాలత్ సెంటర్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు, అనంతరం విద్యార్థులతో కలిసి బైక్ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఆర్ పేపర్ లీకేజీ సమయంలో అందరికీ అందుబాటులో ఉచితంగా కోచింగ్ మెటీరియల్ ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, కానీ బహుజనుల రాజ్యంలో ఏసీ కోచింగ్ సెంటర్లు, ఉచితంగా వైఫై, కంప్యూటర్ సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. బహుజన రాజ్యంలో పేపర్ లీకేజీలు ఉండవని, అలాంటి నేరాలకు పాల్పడితే యావజ్జీవ శిక్ష విధిస్తామని హెచ్చరించారు. కేసీఆర్ పాలనలో 90శాతం మందు దొరుకుతుంది కానీ వైద్యం అందడం లేదని మండిపడ్డారు. కాకతీయ యూనివర్సిటీకి చెందిన 200 ఎకరాలు భూమిని దొంగలు కబ్జా చేశారని ఆరోపించారు. దళిత, బీసీ, మైనారిటీ బంధు పేర్లతో కేసీఆర్ వస్తున్నాడు కానీ ఆయన దుకాణం బంద్ చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఇటీవల నిర్వహించిన ఆర్ఎస్పీ క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ విద్యార్థి మేనిఫెస్టోను ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దార్ల శివరాజ్, బొట్ల కార్తీక్, మాదారపు రవి, రాష్ట్ర అధికార ప్రతినిధి అరుణక్వీన్, వరంగల్ రీజియల్ సెక్రటరీ కన్నం సునీల్, జిల్లా నాయకులు సారయ్య, మంద శ్యాం, శనిగరపు రాజు, రజిత, లక్ష్మీ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థుల ఆందోళన



గేట్ వద్దనే భోజనం చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుల (ఎస్ఎఫ్‌సీ) విద్యార్థులు తమకు హాస్టళ్ల వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం నుంచి మొదటి గేట్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. రాత్రి 11గంటల వరకు కూడా కొనసాగింది. అక్కడే బయటి హాస్టల్‌నుంచి తెచ్చిన సహపంక్తి భోజనాలు చేశారు. మహిళా హాస్టల్‌లో సెల్ఫ్‌ఫైనాన్స్‌కోర్సుల విద్యార్థులు కొందరు నాన్ బోర్డర్లుగా ఉంటుండగా ఈ నెల 7న అధికారులు వారిని ఖాళీ చేయించారు. మంగళవారం కూడా పలువురు విద్యార్థినులను ఖాళీ చేయించి బ్యాగులు బయటపెట్టారని ఆరోపిస్తున్నారు. తాము ఎక్కడ ఉండి చదువుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు రాయాల్సి ఉందని, టైంటేబుల్‌ను కూడా వెల్లడించారని తెలిపారు. యూనివర్సిటీలో ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరంలో హాస్టల్ వసతి కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులకు వివిధ విద్యార్థి సంఘాలు మద్దతుగా పాల్గొన్నాయి. పోలీసులు వచ్చి ఆందోళన విరమించాలని కోరగా విద్యార్థులు వినలేదు. వీసీ వచ్చి తమకు హాస్టల్ వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్యను వివరణ కోరగా మరో 15 రోజుల్లో ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. 15నుంచి 20మంది వరకు నాన్ బోర్డర్లుగా ఉంటుండగా ఖాళీ చేయించామని తెలిపారు.

పోలీసులతో వాగ్వాదం..

గేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులను అక్కడినుంచి పంపించేందుకు పోలీసులు ప్రయత్నం చేయగా వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో కొంత తోపులాడుకున్నారు. దీంతో కొంత సేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆ తరువాత పోలీసులు వెళ్లిపోవడంతో విద్యార్థులు ఆందోళన కొనసాగించారు.

క్లుప్తంగా

వాటర్ ట్యాంకులో పడి వృద్ధుడి మృతి


సమ్మయ్య (ఫైల్)

కమలాపూర్ : మండలంలోని భీంపల్లికి చెందిన కుక్కల సమ్మయ్య (55) మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులో పడి మృతి చెందాడు. పోలీసులు, మృతుడి బంధువుల కథనం ప్రకారం.. సమ్మయ్య సుమారు రెండేళ్లుగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. ఆదివారం నుంచి ఆయన కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికారు. కాగా మంగళవారం ఉదయం భీంపల్లి బస్టాండ్ ప్రాంతంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు వద్ద అతని చెప్పులు ఉండటం, వాటర్ ట్యాంకు నుంచి దుర్వాసన వస్తుండటాన్ని గమనించిన స్థానికులు వాటర్ ట్యాంకు ఎక్కి చూసే సరికి సమ్మయ్య అందులో సమ్మయ్య మృతదేహం కనిపించింది. బాధిత కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ సంజీవ్, ఎస్సై సీమా ఫర్హీన్ సమ్మయ్య మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. మృతుని కొడుకు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సంజీవ్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వివాహిత..

ఆత్మకూరు : గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన మండలంలోని పెంచికలపేటలో చోటు చేసుకుంది. వివరాలిలా.. నర్సంపేట మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామానికి చెందిన ప్రియ (22)కు పెంచికలపేటకు చెందిన బూరుగు కిశోర్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది, వారికి కొడుకు ఉన్నారు. ఆదివారం రాత్రి ప్రియ కొడుకును అన్నం తినిపించే క్రమంలో కొట్టగా ఆమెను కిశోర్ మందలించాడు. దీంతో ప్రియ మనస్తాపానికి గురై సోమవారం ఉదయం ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించగా మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి మంచిక స్వామి ఫిర్యాదు మేరకు సీఐ రవిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరామర్శ

ఎల్కతుర్తి : మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన కర్రె కళ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆమె నివాసంలో మంగళవారం పరామర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, నాయకులు కర్ర లక్ష్మణ్, సూర మొగిళి, రాజు, సదానందం, యాకూబ్, గడ్డం లలిత, ఉట్కూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

సంగెం : ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ యువసేన నాయకుడు చాతళ్ల రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని నార్లవాయి ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ అధ్యక్షుడిగా దామెర మనోహర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 3వ వారంలో నిర్వహించ తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కోడూరి రమేష్, దామెర నరేందర్, స్వామి, వెంకటేష్, రాజు, యాకయ్య, సారయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాగేంద్రస్వామి మహిమ అంటూ వీడియో వైరల్

గీసుకొండ : మండలంలోని ఊకల్ హవేలిలోగల ప్రసిద్ధ నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నాగేంద్రస్వామి మహిమ అంటూ అర్చకులు తీసిన వీడియో నెట్టింట్లో వైరల్ అయింది. మంగళవారం అర్చకులు పూజలు చేస్తుండగా పుట్టపై అలంకరించిన పొడవాటి పూల దండను బొరియలోకి పాము లాక్కుని వెళ్లినట్లు వీడియో (ఇందులో పాము కనపడదు.. బొరియలోకి దండను లాక్కుని వెళ్లే దృశ్యం ఉంది) చిత్రీకరించారు. దీంతో విషయం తెలుసుకున్న స్థానిక భక్తులు ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి పూజలు నిర్వహించారు.

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలి

హన్మకొండ: జనాభాలో 55 శాతానికి పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతిలో జరిగిన ఓబీసీ జాతీయ మహాసభలో ఆయన చేసిన ప్రసంగాన్ని మంగళవారం పత్రిక ప్రకటన రూపంలో వెల్లడించారు. 75 ఏళ్ల స్వాతంత్ర భారతదేశంలో బీసీలు రాజకీయ అంటరానితనానికి వారసులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఐదు శాతం ఉన్న అగ్రవర్ణాలు తరతరాలుగా 90 శాతం పైగా ఉన్న బహుజనులపై ఆధిపత్యం చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఓబీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు.

కంపోస్టు ఎరువుల్లో గాజుపెంకులు

- ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ నిర్వాకం


కంపోస్ట్ ఎరువులను జాలీ పడుతున్న రైతులు


జల్లెడ పట్టిన ఎరువుల్లోని సీసపు ముక్కలు

శాయంపేట : ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు అందించిన కంపోస్ట్ ఎరువుల్లో గాజుపెంకులు, సీసపు ముక్కలు వచ్చిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆ సంస్థ నిర్వాకంపై రైతులు మండిపడుతున్నారు. భూసారం పెంచి అధిక దిగుబడులు అందిస్తాయనే పేరుతో ఆ కంపెనీ అందజేసిన కంపోస్ట్ ఎరువులను కూలీలతో చల్లించగా గాజుపెంకులు గుచ్చుకుని చేతులకు గాయాలైన దుస్థితి నెలకొంది. రైతుల కథనం ప్రకారం.. స్థానిక ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో వరంగల్ మున్సిపాల్టీ నుంచి వేస్టేజీని సిటీ కంపోస్ట్ ఎరువులను మూడు లారీల్లో మండలంలోని గంగిరేణిగూడెం గ్రామానికి తీసుకొచ్చారు. వీటిని జల్లెడ పట్టించి వేస్టేజీని తొలగించి ఎరువులను మాత్రమే గన్నీ సంచుల్లో నింపి రైతులకు కంపోస్ట్ ఎరువులుగా సరఫరా చేయాల్సి ఉంది. అలా కాకుడా సిటీ నుండి వచ్చిన కంపోస్ట్ ఎరువులను డైరెక్ట్‌గా బస్తాల్లో నింపి మండలంలోని గట్లకానిపర్తి, జోగంపల్లి, సూరంపేట, గంగిరేణిగూడెం, కొత్తగట్టు సింగారం, కాట్రపల్లి గ్రామాల్లోని రైతులకు ఒక్కో బస్తా చొప్పున రూ.150 రూపాయలకు సదరు కంపెనీ విక్రయించింది. కొనుగోలు చేసిన రైతులు కంపోస్ట్ ఎరువులను కూలీలతో పంట క్షేత్రాల్లో చల్లించగా కంపోస్ట్ ఎరువుల్లోని గాజుపెంకులు, మొలలతో కూలీల చేతులకు గాయాలయ్యాయి. పొలాల్లోని క్షేత్రాల్లో నడిచిన రైతుల కాళ్లకు గాజుపెంకులు గుచ్చుకొని గాయాలయ్యాయి. దీంతో రైతులు కంపోస్ట్ ఎరువుల బస్తాలను పక్కన పడేశారు. వాటిని కంపెనీ నిర్వాహకులు తీసుకొని తమకు డబ్బులు తిరిగి ఇప్పించాలని జోగంపల్లి గ్రామానికి చెందిన రైతులు స్వర్గం రాజమౌళి, ఏదుల గంగయ్య, పల్లెబోయిన భాస్కర్, రఘురాం కోరుతున్నారు. కిలో ఎరువులను జల్లెడపట్టగా పావు కిలో సీసపు ముక్కలు వచ్చినట్లు రైతులు వాపోయారు. రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారంటూ కంపెనీ యాజమాన్యంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

‘గృహలక్ష్మి’కి దరఖాస్తు చేసుకోవాలి


పరకాల : కౌంటర్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ అనిత రామకృష్ణ, తదితరులు

- మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత రామకృష్ణ

పరకాల : భూమి ఉండి సొంతిల్లు లేని పేదలు గృహలక్ష్మి పథకానికి ఈనెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ కోరారు. దరఖాస్తుల స్వీకరణ కోసం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, కమిషనర్ శేషాంజన్‌స్వామితో కలిసి మంగళవారం చైర్‌పర్సన్ అనిత సందర్శించి పరిశీలించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడారు. స్థలం ఉండి ఇల్లు లేని పేదలు ఆధార్, రేషన్ కార్డులతోపాటు బ్యాంక్ పాసు పుస్తకం, స్థలానికి సంబంధించిన పత్రాలు, కులం, నివాస పత్రాల జిరాక్స్‌లతో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఒంటేరు సారయ్య, ఏకు రాజు, మున్సిపల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గిరిబాబు, ఉద్యోగులు శ్రీనివాస్, కృష్ణంరాజు, శ్రీను, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.


శాయంపేట : జిరాక్స్ సెంటర్‌లో రద్దీ

మండలంలో సందడి

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలు సాయం అందించనున్నట్టు ప్రకటించడంతో మండలంలో సందడి నెలకొంది. పేదలు ఉరుకులు పరుగుల మీద వారికి అవసరమైన కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తున్నారు. జిరాక్స్ సెంటర్లలోనూ రద్దీ నెలకొంది. ఈనెల 10వ తేదీ వరకు మాత్రమే గడువు ఉండడంతో ఈలోగా అవసరమైన పత్రాలు తెచ్చుకుని దరఖాస్తు చేసుకోగలమా..? అంటూ పలువురు పేదలు ఆందోళనకు గురౌతున్నారు.

గడువు పొడిగించాలి

ఎల్కతుర్తి : గృహలక్ష్మి పథకం గడువును ఈనెల 30 వరకు పొడగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రె లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆ పార్టీ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, నాయకులు కామెర వెంకటరమణ, మర్రి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు అభినందన



ఎల్కతుర్తి : స్థానిక తహసీల్దార్ జగత్‌సింగ్‌ను ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కడారి రాజు, బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేష్ యాదవ్, కొరె రాజ్‌కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించి అభినందించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని పలు గ్రామాల్లో తహసీల్దార్లు వెంకటభాస్కర్, జగత్‌సింగ్ మంగళవారం పర్యటించి పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలోనే పోలింగ్ బూత్‌లను పరిశీలించినట్టు తెలిసింది. తహసీల్దార్ల వెంట రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

‘మున్నూరుకాపు’ కన్వీనర్‌గా వీరస్వామి



పరకాల : మున్నూరుకాపు సంఘం పరకాల నియోజకవర్గ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన పిట్ట వీరస్వామిను నియమించినట్టు జిల్లా అధ్యక్షుడు కొత్త దశరథం పటేల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం జిల్లా ఎన్నికలు జరిగే వరకు వీరస్వామి కన్వీనర్‌గా కొనసాగుతారని పేర్కొన్నారు. స్పష్టం చేశారు. కులస్తుల సంక్షేమానికి వీరస్వామి పాటుపడతారని ఆశిస్తున్నట్లు దశరథం తెలిపారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచడమే ధ్యేయం


మాట్లాడుతున్న ఎంఈఓ రమాదేవి

పరకాల : తరగతి వారీగా విద్యార్థుల సామర్థ్యాల పెంపుతోపాటు మెరుగైన అభ్యసన ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దడమే మౌళిక, భాషా, గణిత సామర్థ్యాల సాధన (ఎఫ్ఎల్ఎన్) ధ్యేయమని స్థానిక ఎంఈఓ ఎస్.రమాదేవి తెలిపారు. పట్టణంలో నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభం కాగా ఆమె హాజరై మాట్లాడారు. బోధన ప్రణాళిక మాడ్యుల్స్ పిల్లలకు అభ్యాస దీపికలు ఈ ఏడాది నుంచి ప్రభుత్వం ఇస్తున్నట్లు తెలిపారు. టీఎల్ఎం తయారు చేసి బోధనాభ్యాస ప్రక్రియలో వినియోగించడం ద్వారా కూడా సత్ఫలితాలు సాధించి పిల్లల్లో పునాదులు నిర్మించి ఉత్తమ పౌరులుగా తయారు చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్‌పర్సన్ శ్రీధర్‌స్వామి, పవన్‌కుమార్, స్థానిక రిసోర్స్‌పర్సన్లు సురేష్, స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగి జావ పంపిణీ


విద్యార్థులకు జావ పంపిణీ చేస్తున్న కార్మికులు

ఐనవోలు : మండలంలోని 34 ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం రాగిజావ పంపిణీ చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21న మండలంలోని ఒంటిమామిడిపల్లి పాఠశాలలో రాగిజావ పంపిణీ చేసిన విషయం తెలిసిందే. పని దినాల్లోని అన్ని మంగళ, గురు, శనివారాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రాగిజావ అందించనున్నారు. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, 10 గ్రాముల బెల్లం పౌడర్‌లను 250 మిల్లీలీటర్ల వేడినీటిలో కలిపి మిశ్రమాన్ని జావగా తయారు చేసి అందిస్తున్నారు. రాగిజావతో విద్యార్థుల్లో ఐరన్ శాతం పెరిగి పౌష్టికాహారం లోపం తగ్గి ఆరోగ్యంగా ఉంటారని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

14న గద్దర్ సంస్మరణ సభ

ఎల్కతుర్తి : మండలంలోని ముల్కనూర్ గ్రామంలోని అంబేడ్కర్ కూడలి వద్ద ఈనెల 14న గద్దర్ సంస్మరణ సభ నిర్వహించనున్నట్టు ఉద్యమకారుల సంఘం నాయకులు తెలిపారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామంలోని ప్రజాగ్రంథాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. గద్దర్ మృతి బాధాకరమన్నారు. సభకు ప్రజాసంఘాల, రాజకీయ పార్టీల, దళిత సంఘాల నాయకులు, ఉద్యమకారులు, గద్దర్ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో డ్యాగల సారయ్య, ఎదులాపురం తిరుపతి, సర్పంచ్ మాడ్గుల కొమురయ్య, మాడ్గుల అశోక్, మాట్ల వెంకటస్వామి, రేణికుంట్ల భిక్షపతి, చెప్యాల ప్రకాశ్, కడెం రమేష్, దుర్గయ్య, రవి పాల్గొన్నారు.

నీటి పారుదల సీఈ కార్యాలయం ఎదుట ధర్నా

హసన్‌పర్తి : మెగా కంపెనీ వేధింపును నిరసిస్తూ మండలంలోని చింతగట్టు క్యాంప్ ఆవరణలోని నీటిపారుదల శాఖ వరంగల్ చీఫ్ ఇంజనీర్ (సీఈ) కార్యాలయం ఎదుట జే.చొక్కారావు లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా భారత కార్మిక సంఘాల సమైక్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకుడు కొత్తపల్లి రవి మాట్లాడారు. ఈస్ట్ యూనియన్‌లో చేరిన నేతలను వివిధ ప్రాంతాలకు అక్రమంగా బదిలీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ బదిలీలను రద్దు చేసి కార్మికులను యథాస్థానంలో నియమించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ వేయాలని, జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, కార్మికులకు ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనుల్లో నాణ్యత కీలకం


ఈజీఎస్ పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్

దామెర : ఈజీఎస్ పనుల్లో నాణ్యత కీలకమని క్వాలిటీ కంట్రోల్ అధికారి పి.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని దామెర, కోగిల్వాయి, ల్యాదెళ్ల, పులుకుర్తి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈజీఎస్ కింద చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను, చెరువులపై నిర్మించిన రోడ్లను తనిఖీ చేశారు. పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం అధికారులకు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శులు నరేష్, సరళ, ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీనివాస్, సారంగం పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి

సంగెం : ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధిని సాధించవచ్చని వరల్డ్ ఉమెన్ బ్యాంకింగ్ అధికారి అజయ్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ అనిల్ అధ్యక్షతన ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అజయ్‌సింగ్ మాట్లాడారు. ప్రజలందరూ బ్యాంకు ఖాతాలు కలిగి ఉండాలని చెప్పారు. ప్రతి ఖాతాదారు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజనకు వార్షిక ప్రీమియం రూ.436లు, ప్రధాన మంత్రి జీవన్ సురక్ష బీమా యోజనకు రూ.20లు చెల్లించాలని కోరారు. అపరిచితులకు ఖాతా వివరాలు, ఓటీపీ తెలియజేయవద్దని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండేటి బాబు, ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య, నర్సింహస్వామి, సర్పంచ్ ప్రభాకర్, లీడ్ బ్యాంకు కౌన్సిలర్ భాస్కరాచారి, ఏపీఎం కిషన్, సీసీలు సురేష్, కుమారస్వామి పాల్గొన్నారు.

ఆర్గానిక్ ఫార్మింగ్ ఆరోగ్యానికి మేలు

కేయూ క్యాంపస్: ఆర్గానిక్ ఫార్మింగ్‌తో ప్రజల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేష్‌లాల్ అన్నారు. కేయూలోని మైక్రోబయాలజీ విభాగంలో నిర్వహిస్తున్న ట్రెనింగ్ ఫర్ ఎక్స్‌టెన్షన్ స్టాఫ్ ఆన్ ఆర్గానిక్ అండ్ న్యాచురల్ ఫార్మింగ్ అంశంపై మంగళవారం సాయంత్రం నిర్వహించిన ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణతోపాటుగా ప్రజల జీవన ప్రమాణం పెరుగుతుందన్నారు. సైన్స్ విభాగాల డీన్ ఆచార్య పి.మల్లారెడ్డి మాట్లాడుతూ ఆర్గానిక్ ఫార్మింగ్ సామాజిక బాధ్యత అన్నారు. సేంద్రీయ పద్ధతులు ముఖ్యమన్నారు. అనంతరం అధ్యాపకులకు, ఏఈఓలకు వర్క్‌షాప్ అంశాలపై పరీక్ష నిర్వహించారు. సభకు మైక్రో బయాలజీ విభాగాధిపతి శ్రీనివాస్ ముంజం అధ్యక్షత వహించగా కోఆర్డినేటర్ ప్రవీణ్, అధ్యాపకులు డాక్టర్ సుజాత, డాక్టర్ వెంకటయ్య, అడ్జెంట్ ఆచార్యులు రాంరెడ్డి, డాక్టర్ సూర్యం, డాక్టర్ వెంకటగోపీనాథ్, డాక్టర్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లో చేరిక

- పార్టీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్


బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే రమేష్

ఐనవోలు : సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధిని చూసే పలువురు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. మండలంలోని పున్నేలుకు చెందిన వివిధ పార్టీల శ్రేణులు సుమారు 100 మంది హనుమకొండలోని ఆయన నివాసంలో బీఆర్‌ఎస్‌లో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే రమేష్ ఆహ్వానించి మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాసంక్షేమమే ఎజెండాగా పని చేస్తున్నట్టు తెలిపారు. మానవీయ కోణంలో కులమతాలకు అతీతంగా జనరంజక పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. దేశానికే నిర్దేశం చేసేలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్న ఘనత బీఆర్‌ఎస్ సొంతమన్నారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు భారీగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో సమ్మిళిత, సమీకృత అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఉపసర్పంచ్ మామునూరు నర్సయ్య, నాయకులు చేరాలు, అశోక్, సంజీవ, జిల్లా సురేందర్, బాబు, రమేష్, సారయ్య, ప్రభాకర్, పాపయ్య, కళావతి, వజ్రమ్మ, కట్టమ్మ ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


మాట్లాడుతున్న సంపత్‌రావు

- ఎస్ఎస్ఆర్ సంస్థల అధినేత సంపత్‌రావు

దామెర : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్ఎస్ఆర్ సంస్థల అధినేత నాయినేని సంపత్‌రావు తెలిపారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని దామెర క్రాస్‌లోని ఎస్ఎస్ఆర్ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన శిబిరంలో సుమారు 100 మంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని సంపత్‌రావు సందర్శించి మాట్లాడారు. ప్రాణాపాయ స్థితిలో వారికి రక్తం సంజీవనిలా ఉపయోగపడుతుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం లభించక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ ఆర్నెళ్లకోసారి రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానంపై అపోహలు వీడాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ అడ్వైజర్ నిఖిత నాగేశ్వర్‌రావు, కరస్పాండెంట్ కళింగరావు, డైరెక్టర్లు స్వామిరావు, నరేందర్, ప్రిన్సిపాల్ సిద్ధా రంజిత్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఇన్‌చార్జ్‌లు మొగిలి, రాజు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం


శాయంపేట : వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పెండెం రాజు, నాయకులు

- యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పెండెం రాజు

శాయంపేట : ఉద్యమాల ద్వారానే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమౌతాయని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పెండెం రాజు స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూఎస్‌పీసీ, యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీ, సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో తలపెట్టిన మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఉపాధ్యాయులతో కలిసి మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, బదిలీలు చేపట్టాలని, ఐఆర్ చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, పీఆర్సీ రెండో కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. ఈనెల 12న ధర్నా, ర్యాలీల్లో ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ మండల నాయకులు రవికుమార్, శ్రీనివాస్, చంద్రమౌళి, తిరుపతిరెడ్డి, రషీద్, భారతి, లక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : ఈనెల 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీ, సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో తలపెట్టిన మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో యూఎస్‌పీసీ జిల్లా బాధ్యుడు తంగెళ్ల సుదర్శనం, సీఎస్ఆర్ మల్లిక్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ ఆఫీసర్ డాక్టర్ టీ.రమేష్, ఐనవోలు కాంప్లెక్స్ హెచ్ఎం పాక శ్రీహర్షుడు, యూఎస్‌పీఎస్ బాధ్యులు చుంచుకాల లింగారావు, బీమళ్ల సారయ్య, కట్ల మహేందర్‌రెడ్డి, బాలోజు బ్రహ్మచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : ఈనెల 12న తలపెట్టిన ర్యాలీ, సెప్టెంబర్ 1న తలపెట్టిన ధర్నా వాల్‌పోస్టర్‌ను స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులతో కలిసి యూఎస్‌పీసీ మండల స్టీరింగ్ సభ్యుడు డాక్టర్ ఎం.సారంగపాణి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజనేయులు, సంపత్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పత్తి సాగులో సస్యరక్షణ చర్యలతో లబ్ధి


పత్తి పంటను పరిశీలిస్తున్న కుమారస్వామి

శాయంపేట : పత్తి పంట సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టి లబ్ధి పొందాలని ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ టెక్నికల్ కోఆర్డినేటర్ కుమారస్వామి కోరారు. మండల కేంద్రంలోని క్షేత్ర కార్యాలయంలో అసోసియేట్ మేనేజర్ అక్కల రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పత్తి పంటలో భౌతిక, యాంత్రిక, జీవ, రసాయన పద్ధతులను అవలంభిస్తే భూసారాన్ని పెంచుకోవచ్చని, పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని పలువురు రైతుల పత్తి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. సుమారు 15 రోజుల క్రితం కురిసిన వర్షాలతో నేల గడుసుపోవడంతో మొక్కలు ఎదిగే స్థితి లేదన్నారు. అలాంటి నేలల్లో అంతర కృషి చేసి 19:19:19 లాంటి ద్రావణాలను పిచికారీ చేయాలని చెప్పారు. భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులను వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో రేగొండ ప్రజ్వల్ ప్రాజెక్ట్ యూనిట్ మేనేజర్ బత్తిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

విశ్వరూప సభను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుకుమార్

ఆత్మకూరు : ఈనెల మూడో వారంలో జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ గద్దల సుకుమార్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెడతామని హామీ ఇచ్చిన బీజేపీ తొమ్మిదేళ్లుగా మోసం చేస్తోందని విమర్శించారు. ప్రతిపక్షాలు కూడా మౌనంగా ఉన్నాయని మండిపడ్డారు. ఇకనైనా ప్రతిపక్షాలు మౌనం వీడి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలని ఆకాంక్షించారు. ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడతామని చెప్పారు. సమావేశంలో ఎంఎస్పీ సీనియర్ నాయకుడు మామిడిపెల్లి రవీందర్, ఎమ్మార్పీఎస్ నాయకులు మంద రవి, పెరుమాండ్ల శ్రీనివాస్, హరి, రవి, బాబు, యుగంధర్, సురేందర్ పాల్గొన్నారు.